
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



15,723 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
సోమశిల జలాశయానికి గురువారం 15,723 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 1100 క్యూసెక్కులు, పవర్ టన్నెల్‌కు 2500, ఉత్తర కాలువకు 370, కండలేరుకు 6 వేల క్యూసెక్కులు చేస్తున్నారు. 37.446 టీఎంసీల నిల్వ ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,04,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,403
3 శాతం జీఎస్టీతో	రూ.9,685
సవర (8 గ్రా)	రూ.77,480

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.8 /28.3
జిల్లాలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉంటుంది. గురువారం గాలిలో తేమ 58 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆటవిక రాజ్యంలో ఉన్నామా?



వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల ఘటన చూశాక ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నామా? ఆటవిక రాజ్యంలో ఉన్నామా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నేత వేల్పుల రాముపై టీడీపీ గూండాలు దాడి చేసి గాయ పరచడం చేస్తే ప్రజాస్వామ్యం బతికి బట్ట కట్టడం కష్టంగా అనిపిస్తోంది. ఓ శాసనమండలి సభ్యుడికే పోలీసులు కనీస రక్షణ లేకపోతే సామాన్యుడి పరిస్థితి ఏమిటి. జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ ప్రజలను భయాందోళనకు గురి చేసి గెలవాలని చూడడం హేయమైన చర్య. ప్రజాస్వామ్యంలో వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, ఎన్నికల స్వేచ్ఛకు భంగం కలిగించే వారిపై కఠిన చర్య తీసుకోవాలి. ఎన్నికల కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకొని చర్యలు చేపట్టాలి. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలి.

– మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆత్మకూరు

పులివెందుల ఘటన అరాచకానికి పరాకాష్ట



పులివెందుల ఘటన టీడీపీ అరాచకానికి పరాకాష్టగా ఉంది. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసి విజయం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. సాఫీగా ఎన్నికలు జరిగితే ఓటమి తప్పదని, ముందస్తు వ్యూహంలో భాగంగా భౌతిక దాడులకు తెగిస్తున్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌తోపాటు మరొకరిపై హత్యాయత్నం జరగడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు. అధికారం మదంతో ఎల్లో సైకో బ్యాచ్ వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్‌లో స్వేచ్ఛాయుత ఎన్నికలకు గొడ్డలిపెట్టుగా మారుతోంది. గత ఐదేళ్ల ఫ్యాక్షన్ నిజానికి దూరంగా ఉన్న సీమ పల్లెల్లో టీడీపీ తిరిగి తెస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలు. వారిని భయపెట్టి బూత్‌లు ఆక్రమించి ఎన్నికల్లో లబ్ధిపొందే ప్రయత్నం చేయడం తగదు.

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త

బ్రిటిష్ పాలనను తలపిస్తున్న కూటమి



కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రత్యర్థులపై దాడులు చేయడం, ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెట్టడం, జైళ్లకు పంపడం చూస్తుంటే బ్రిటిష్ పాలన కొనసాగుతుందా అనే అనుమానం కలుగుతుంది. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నేత వేల్పుల రాముపై నేతలపై దాడి చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలి. ప్రజాస్వామ్యంలో ఓ ప్రతిపక్ష పార్టీకి చెందిన శాసనమండలి సభ్యుడికి రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు రక్షణ ఉంటుందా. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తమ అధికారంతో ప్రజలను భయాందోళనలకు గురి చేసి, గెలవాలని చూస్తుంది. ఎన్నికల స్వేచ్ఛ ఆటంకం కలిగించే వారిపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.

– కాకాణి పూజిత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్

నలుగురికి కారుణ్య నియామకాలు



నెల్లూరు (అర్బన్): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన కుటుంబ సభ్యులు నలుగురికి కలెక్టరేట్‌లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, ఏఓ విజయకుమార్ గురువారం కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. వ్యవసాయ శాఖలో మెసెంజర్‌గా పనిచేస్తూ మృతి చెందిన పి.షాకెర్ల కుమారుడు ఫాజిల్‌ఖాన్‌కు అటవీశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. రెవెన్యూ శాఖలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ మృతి చెందిన ఫయాజ్‌బాషా కుమారుడు సిరాజ్‌బాషాను రవాణా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందిన నర్సయ్య భార్య పార్వతికు రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్, వైద్య విధాన పరిషత్‌లో సీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మృతి చెందిన రమేష్‌రెడ్డి కుమార్తె హర్షితకు సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

పచ్చ మాఫియా గ్రావెల్ దందా

చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్, అటవీశాఖ భూముల్లో తవ్వకాలు



నెల్లూరు: కల్లూరుపల్లి నుంచి ట్రాక్టర్లలో తరలింపు

- ఎమ్మెల్యేల అండతో అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా ప్రకృతి విధ్వంసం
- పోలీస్, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖలకు నెల మామూళ్లు
- అడ్డుకునే వారు లేకపోవడంతో రూ.కోట్లు కొల్లగొడుతున్న వైనం
- కావలి, సర్వేపల్లి, కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరులో విచ్చలవిడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి 'పచ్చ' మాఫియా బరి తెగించింది. బకాసురుల్లా పంచ భూతాల నుంచి సహజ వనరులను దోచుకుంటున్నారు. ఎమ్మెల్యేల అండతో చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్, అటవీశాఖ భూముల్లో విచ్చల విడిగా గ్రావెల్ తవ్వకాలు చేస్తూ రూ.కోట్లల్లో దోచుకుంటున్నారు. ఇందులో అత్యధికంగా ఎమ్మెల్యేలకు వాటాలు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. తమ్ముళ్ల ధన దాహానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలే దన్నుగా నిలబడడంతో అధికార యంత్రాంగాలు అక్రమ దందాకు మోకరిల్లి.. వారిచ్చే మామూళ్లతో కళ్లకు గంతలు కట్టుకున్నారన్న ఆరోపణలున్నాయి. కావలి, ఆత్మకూరు, సర్వేపల్లి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో తమ్ముళ్లు ఏదీ వదిలి పెట్టడం లేదు. చెరువులు, కుంటలు, తిప్పలపై గద్దల్లా వాలి పోతున్నారు. గ్రావెల్, మట్టిని తవ్వకాలు చేసి విక్రయించుకుంటున్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



నెల్లూరు: కల్లూరుపల్లి ప్రాంతంలో గ్రావెల్ తరలించడానికి బారులు తీరిన ట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సహజ వనరుల సంపద దోపిడీ చేసే 'పచ్చ' మాఫియాలకు జిల్లా అడ్డాగా మారింది. అధికారం చేజిక్కించుకున్నప్పటి నుంచి ఏడాది కాలంగా విరామం లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలతో రాష్ట్రంలోనే జిల్లా నేతలు చరిత్ర సృష్టిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, అటవీశాఖ భూముల్లో భారీ యంత్రాలు పెట్టి గ్రావెల్‌ను అక్రమ రవాణా సాగిస్తున్నారు. అక్రమంగా మైనింగ్, గ్రావెల్ తవ్వకాలు చేశారంటూ చేయని నేరాలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టించి టీడీపీ నేతలు పైశాచికానందం పొందుతున్నారు. ఇప్పుడు వీరు సాగిస్తున్న ప్రకృతి సంపద దోపిడీకి జీవిత కాలంలో జైల్లో పెట్టాల్సి ఉంటుందని జనం అభిపాయ పడుతున్నారు.

రూ.కోట్లల్లో గ్రావెల్ దందా

మైనింగ్ అధికారులు లెక్కల ప్రకారం చూస్తే ఎకరా భూమిలో మీటరు లోతున తవ్వకాలు జరిపితే 4 వేల ఘనపు మీటర్ల ఖనిజం (గ్రావెల్) లభిస్తోంది. టిప్పర్‌కు నిండుగా నింపితే 12 క్యూబిక్ మీటర్లు పడుతుంది. అంటే ఎకరాకు 400 టిప్పర్లు గ్రావెల్ వస్తుంది. ఈ లెక్కన ఎకరాకు 4,800 క్యూబిక్ మీటర్లు రవాణా సాగుతోంది. టిప్పర్‌కు రూ.10 వేలు వంతున లెక్క పెడితే ఎకరాలో రూ.40 లక్షల వరకు వస్తుంది. ఇది ఎకరా భూమిలో మీటరు లోతు తవ్వకాలు చేస్తే మరి పదిహేను మీటర్ల లోతు తీస్తే రూ.కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి.



నెల్లూరు: కల్లూరుపల్లి ప్రాంతంలో ఇలా..

చెరువును తవ్వేస్తున్నారు

దగదర్తి : మండలంలోని వెలుపోడు పంచాయతీ కామినేనిపాళెం చెరువులో టీడీపీ నేతలు టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. 24 గంటలు టిప్పర్లతో యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు దగదర్తి మండలం ఉలవపాళ్ల, దామవరం, సున్నపుబట్టి, కౌరుగుంట, మబ్బుగుంటపాళెం, అనంతవరం చెరువుల్లో పోరంబోకు, మేత పోరంబోకు భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ప్రకృతి సహజ స్వరూపం కోల్పోతున్నాయి. ప్రధానంగా దగదర్తి మండలం దామవరం వద్ద ఎయిర్‌పోర్టుకు కేటాయించిన భూములు, పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లోనూ గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ముఖ్యంగా ఇఫ్కో భూముల్లోనూ వెనుక వైపు నుంచి భారీగా తవ్వేస్తున్నారు.



కామినేనిపాళెం చెరువులో గ్రావెల్ తవ్వకం

కేజీఎఫ్ తరహాలో గ్రావెల్ దందా



తాళ్లపాళెం చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్‌ను ట్రాక్టర్ల ద్వారా తరలింపు

కావలి (జలదంకి): కావలి నియోజకవర్గంలో కేజీఎఫ్ తరహాలో గ్రావెల్ దందా జరుగుతోంది. గ్రావెల్ మాఫియాకు కాసులు కురిపిస్తుంది. మండలంలోని ఇప్పటికే కావలి పెద్ద చెరువు, కొత్తపల్లి, రాజువారిచింతలపాళెం, రుద్రకోట, బుడమగుంట, ముసునూరు, గౌరవరం చెరువుల్లో గ్రావెల్ కొల్లగొట్టిన ఘనులు తాజాగా తాళ్లపాళెం, ఆముదాలదిన్నె చెరువుల్లో రేయింబవళ్లు గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ఇక బోగోలు మండలంలో ముంగమూరు, కొండబిట్రగుంట, పాతబిట్రగుంట, కడనూతల, కోవూరుపల్లి, బోగోలు, కప్పరాళ్లతిప్ప తదితర ప్రాంతాల్లో నాణ్యమైన గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. అల్లూరు మండలం నార్తుఆములూరులో గ్రావెల్ దందా ఓ రేంజ్‌లో సాగుతోంది. రోజుకు వంద టిప్పర్లకు పైగా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే టీడీపీ నేతలు రాత్రి, పగలు తేడా లేకుండానే గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం టిప్పర్ రూ.10 వేల వరకు పలుకుతోంది. ఈ లెక్కన నిత్యం రూ.2 కోట్ల వరకు గ్రావెల్ వ్యాపారం జరుగుతోంది. మమ్మల్ని అడిగేదెవరు, మమ్మల్ని అడ్డుకునేదెవరు అంటూ అక్రమ గ్రావెల్ దందా కొనసాగిస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. తాజాగా తాళ్లపాళెం, ఆముదాలదిన్నె చెరువుల్లో కొద్ది రోజులుగా మూడు జేసీబీలు పెట్టి 50 నుంచి 60 ట్రాక్టర్లతో రేయింబవళ్లు గ్రావెల్‌ను అక్రమంగా లేఅవుట్లకు తరలిస్తూ దోచుకుంటున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులు సైతం మాట్లాడేందుకు భయపడుతున్నారు.

సర్వేపల్లిలో బరి తెగింపు



సర్వేపల్లి పంచాయతీ నాగబొట్లకండ్రికలో యంత్రాలతో అక్రమంగా తవ్వుతున్న గ్రావెల్



వర్షపు నీటిలో ఆగని అక్రమ గ్రావెల్ తరలింపు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు మండలాల్లో అధికార పార్టీ నాయకులు అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ముత్తుకూరు పిడతాపోలూరు చెరువులో మట్టిని ఇష్టానుసారం అక్రమంగా సమీపంలోని లే అవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మనుబోలు మండలంలో అవసరాన్ని బట్టి తరచుగా గ్రావెల్ తవ్వుతున్నారు. ఫిర్యాదులు అందితే కొద్ది రోజులు ఆపి తర్వాత గ్రావెల్‌ను తరలిస్తున్నారు. వెంకటాచలం మండలంలో అక్రమంగా గ్రావెల్ రూ.కోట్లలో నిర్వహిస్తున్నారు. సర్వేపల్లి పంచాయతీ నాగబొట్లకండ్రిక గ్రామ అటవీ భూముల్లో స్వయంగా ముఖ్య నాయకుడు కనుసన్నల్లో ముత్తుకూరు మండలం సాగరమాల ప్రాజెక్ట్ (హైవే రోడ్డు నిర్మాణం), నెల్లూరు లేఅవుట్లకు తరలిస్తున్నారు. ప్రతినిత్యం రూ.20 లక్షల విలువైన గ్రావెల్‌ను అటవీ భూముల్లో తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు అధికార ఒత్తిళ్లతో పట్టించుకోవడం లేదు. పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ కొల్లకందుకూరు తిప్ప నుంచి పది రోజులుగా గ్రావెల్‌ను నెల్లూరు లే అవుట్లకు తరలిస్తున్నారు. ప్రతి నిత్యం 20 టిప్పర్లు తరలిపోతున్నాయి. టిప్పర్‌కు రూ.5 వేలు వసూలు చేసి ప్రతి నిత్యం రూ.లక్ష సంపాదిస్తున్నారు. గ్రావెల్‌ను యంత్రాలతో లోడి టిప్పర్లకు నింపి పంపుతున్నారు.

అవినీతి మత్తు.. గ్రావెల్ ఎత్తు



వింజమూరులోని యర్రబల్లిపాళెం చెరువు నుంచి జేసీబీ, టిప్పర్లతో మట్టి తరలిస్తున్న దృశ్యం

ఉదయగిరి: నియోజకవర్గంలో పలు మండలాల్లో మట్టి, గ్రావెల్ మాఫియాలు బరి తెగిస్తున్నాయి. చెరువులు, శ్మశానాలు, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వేసి జేబులు నింపుకుంటున్నారు. వ్యవసాయ భూములు చదును, లేఅవుట్లు, ఇతర అవసరాల కోసం జరుగుతున్న దోపిడీలో అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. వింజమూరులోని మల్లపరాజు వాగు చెరువు, పాతూరు, యర్రబల్లిపాళెం చెరువుల్లో రేయింబవళ్లు విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నారు. ఈ మూడు చెరువుల్లో సుమారు 50 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమార్కులు తరలించినట్లు అంచనా. అదే అనుమతులు తీసుకుని ఉంటే.. ప్రభుత్వానికి సుమారుగా రూ.2.25 కోట్లు రాబడి వచ్చేదని అధికారులు చెబుతున్నారు. వరికుంటపాడు మండలం జడదేవి, తూర్పు బోయమడుగుల, విరువూరు, టి.కొండారెడ్డిపల్లి, జి.కొండారెడ్డి పల్లి తదితర గ్రామాల్లో అక్రమంగా గ్రావెల్ రవాణా సాగుతోంది. దుత్తలూరు మండలం తెడ్డుపాడు, దుత్తలూరు, నందిపాడు, నర్రవాడ పంచాయతీల్లో మట్టి, గ్రావెల్ అక్రమ దందాకు అంతూపంతూ లేదు. కలిగిరి, జలదంకి, కొండాపురం మండలాల్లో అయితే ప్రభుత్వ భూముల నుంచి మట్టి తరలింపు జరుగుతోంది. పెద్ద ఎత్తున మట్టి, గ్రావెల్ తరలిస్తున్నా రెవె న్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రావెల్, మట్టి దోపిడీ.. పట్టించుకునే నాథుడేడీ?



ఏఎస్‌పేట మండలం హసనాపురం చెరువులో మట్టి తవ్వేయడంతో భారీ గుంతలు

ఆత్మకూరు: నియోజకవర్గంలో చెరువులు, కొండలు, తిప్ప ప్రాంతాల్లో గ్రావెల్‌ను తమ్ముళ్లు విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. పెద్ద ఎత్తున్న గ్రావెల్, మట్టి దోపిడీ జరుగుతున్నా.. పట్టించుకొనే నాథుడేడి అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆత్మకూరు మేజర్ చెరువు, ముస్తాపురం చెరువుల నుంచి మట్టిని నిత్యం సుమారు 10 టిప్పర్లల్లో యథేచ్ఛగా లేఅవుట్లకు తరలిస్తున్నారు. చేజర్ల మండలం టీకేపాడు ఎర్రకుంట (చిన్న చెరువు) నుంచి కాకివాయికి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించారు. ఏఎస్‌పేట మండలం కొండమీదకొండూరు తిప్ప ప్రాంతం నుంచి గ్రావెల్‌ను ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాల్లో ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు తరలిస్తూ దోచుకుంటున్నారు. ఏఎస్‌పేట మండలం హసనాపురం చెరువు నుంచి క్యూబిక్ మీటర్ల కొద్దీ మట్టిని తరలించడంతో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. అనంతసాగరం మండలం వెంకటరెడ్డిపల్లి, మంచాలపల్లి చెరువులతోపాటు అటవీ ప్రాంతం నుంచి అనంతసాగరం, సోమశిల సమీపంలోని హైవేలో వెంచర్లకు తరలిస్తున్నారు.

చెలరేగుతున్న తమ్ముళ్లు

కందుకూరు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతుంది. సాగునీటి చెరువులను లక్ష్యంగా చేసుకుని భారీ దోపిడీకి పాల్పడుతోంది. కొండికందుకూరు చెరువు నుంచి పెద్ద ఎత్తున మట్టి, కోవూరు, కొండముడుసుపాళెం చెరువుల నుంచి భారీగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. గుడ్లూరు మండలం ఏలూరుపాడు చెరువు నుంచి రైల్వేలైన్ అభివృద్ధి పనుల కోసం 6,500 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వుకునేందుకు అనుమతి తీసుకున్న కాంట్రాక్టర్‌లు దాదాపు 13 వేల క్యూబిక్ మీటర్ల వరకు మట్టి తవ్వకాలు చేశారు. కేవలం 90 సెం.మీ. లోతులోనే మట్టి తవ్వకాలు చేయాలని నిబంధన ఉన్నా మూడు మీటర్ల లోతు వరకు ఈ చెరువులో మట్టి తవ్వకాలు చేసినా ఇరిగేషన్‌శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. పాజర్ల, తెట్టు, ఏలూరుపాడు చెరువుల్లో ఇష్టారాజ్యం గ్రావెల్ తవ్వకాలు చేశారు. లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్ట్‌ను సైతం గ్రావెల్ మాఫియా వదలడం లేదు. అయినా సరే ప్రాజెక్ట్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. లింగసముద్రం కొత్తచెరువు, యర్రారెడ్డిపాళెంలో ప్రభుత్వ భూములు, మాలకొండరాయునిపాళెం చెరువు, చినపవని, పెదపవని, మొగిలిచర్ల సాగునీటి చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలు భారీగా సాగాయి. ఉలవపాడు మండలంలోని రాజుపాళెం, వీరేపల్లి, భీమవరం, బద్దిపూడి చెరువుల నుంచి గ్రావెల్, కరేడు చెరువు నుంచి మట్టిని యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలించేశారు. వాస్తవానికి చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలకు ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.106 చెల్లించాల్సి ఉంది. కానీ గ్రావెల్ మాఫియా ఎటువంటి అనుమతులు తీసుకోవడం లేదు. ఒక్క రూపాయి కూడా రాయల్టీ చెల్లించడం లేదు.



లింగసముద్రంలోని కొత్త చెరువులో గ్రావెల్ తవ్వకాలు

ఓటమి భయంతోనే టీడీపీ అరాచకం

- పులివెందులలో టీడీపీని గెలిపించే బాధ్యత ఖాకీలపై పెట్టారా?
- గీత దాటిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- వైఎస్సార్‌సీపీ బీసీ సంఘాల జిల్లా నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కడప జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ అరాచకాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ సంఘాల జిల్లా నాయకులు మండిపడ్డారు. పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై జరిగిన అరాచకమైన దాడిని ఖండిస్తూ గురువారం నగరంలోని మినీబైపాస్ రోడ్డులో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల విశ్వాసానికి దూరం కావడం వల్లే పోలీసుల సాయంతో ఉప ఎన్నికల్లో గెలిచి పరువు కాపాడుకునేందుకు చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల జెడ్పీటీసీ స్థానం వైఎస్సార్‌సీపీదేనని, దురదుష్టవశాత్తూ ప్రమాదంలో ఆ జెడ్పీటీసీ మరణిస్తే ఇప్పుడు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారన్నారు. పదవీ కాలంలో ఏడాదే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికల్లో రూ.కోట్లల్లో డబ్బు ఖర్చుపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందన్నారు.

గాయపడిన వారిపైనే కేసులా?

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో తాము జెడ్పీటీసీని కైవసం చేసుకున్నామని చెప్పుకోవడానికి చంద్రబాబు అత్యంత నీచానికి దిగజారుతున్నారన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌తోపాటు తమ పార్టీ నాయకులు వేల్పుల రాముపై దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించారన్నారు. టీడీపీ గూండాల దాడిలో గాయపడి చావుబ్రతుల్లో ఉన్న వేల్పుల రాము మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారన్నారు. కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ స్థాయిని మరిచి విడ్డూరంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతూ లోకేశ్ చెప్పినట్లు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు బనాయిస్తున్న ఐపీఎస్ అధికారులతో సహా ఎవరూ చట్టానికి అతీతులు కారన్న విషయం మరిచి పోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర మహిళా విభాగం సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సంఘాల జిల్లా నాయకులు

'కనుపూరు చెరువు మట్టి' కేసులో కాకాణికి బెయిల్



నెల్లూరు (లీగల్): కనుపూరు చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు 4వ అదనపు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నిషాద్ నాజ్ షేక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరు రూ.25 వేలు ఆస్తి విలువ కలిగిన ఇద్దరు జామీన్‌దారుల పూచీకత్తు, రూ.25,000 వ్యక్తిగత బాండ్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసుల విచారణకు కాకాణి సహకరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో కాకాణిపై ప్రాథమిక ఆధారాల్లేవని, కేవలం రాజకీయ కక్షతో మొదటి నిందితుడిగా కేసు బనాయించారని వాదనలు వినిపించగా, వెంకటాచలం పోలీసులు తరఫున పీపీ మాల్యాద్రి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కాకాణికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

క్లుప్తంగా

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడా పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు, జట్ల ఎంపికలను గురువారం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభించినట్లు క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే ఎతిరాజ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తొలిరోజు అథ్లెటిక్స్, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, కబడ్డీ క్రీడాంశాల్లో అండర్ – 22 విభాగంలో పోటీలు, ఎంపికలు చేపట్టామన్నారు. జిల్లా నలుమూలల నుంచి 275 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ఈ ఎంపికల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఖోఖో, బాస్కెట్‌బాల్, హాకీ, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు,ఎంపికలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడండి



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీ వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు మురళీకృష్ణ యాదవ్, యేసోబు శ్రీనివాసులు కోరారు. కోడూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆహారం కల్తీ జరిగి విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకుని గురువారం ప్రిన్సిపల్, విద్యార్థినులతో చర్చించారు. అనంతరం భోజనశాలకు వెళ్లి పరిశీలించారు. గురుకుల పాఠశాలలో విద్యుత్ సమస్యపై స్థానిక ఏఈతో మాట్లాడారు.

దాడిని ఖండిస్తున్నాం

పులివెందులలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై రౌడీమూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మురళీకృష్ణ యాదవ్ తెలిపారు.

పిడుగుపాటుకు గేదె, ఆవుల మృత్యువాత



మృతిచెందిన గేదె

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని రెండు గ్రామాల్లో రైతులకు చెందిన ఒక గేదె, రెండు ఆవులు గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతిచెందాయి. స్థానికుల కథనం మేరకు.. తక్కెళ్లపాడులో కాకి కన్నయ్య సుమారు రూ.80 వేల విలువైన తన గేదెను ఇంటిముందు కట్టేశాడు. పిడుగుపడి గేదె మృతిచెందింది. జువ్విగుంటపాళెంలో వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఉన్న రెండు ఆవులు పిడుగుపాటుకు గురై చనిపోయాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు. కాగా ఉదయగిరి మండలం ఆర్లపడియలో పిడుగుపాటుకు నాలుగు మేకలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన ఆశీర్వాదం అటవీ ప్రాంతంలో మేకలు మేపుకొంటుండగా ఒక్కసారిగా పిడుగుపడడంతో జీవాలు మృతి చెందాయి. మరో రెండు మేకల పరిస్థితి విషమంగా ఉంది.

బకాయిల విడుదలకు డిమాండ్



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): చేనేత రంగానికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పముజుల హరి డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత కార్మికుల ఆత్మహత్యలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రూ.127.87 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సహకార సంఘాలకు త్రిఫ్ట్ ఫండ్ కింద రావాల్సిన రూ.17 కోట్లకు బదులుగా రూ.5 కోట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, చేనేత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శేషయ్య, నేతలు వెంకటసురేష్, పముజుల చంద్రశేఖర్ రావు, బైనా రాజశేఖర్ పాల్గొన్నారు.

యువతిపై లైంగికదాడికి యత్నం

ఇందుకూరుపేట: మతిస్థిమితం లేని యువతిపై ఓ కామాంధుడు లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన మండంలోని కొత్తూరు మజరా మేనాటిపాళెంలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఇందుకూరుపేటకు చెందిన మైనంపాటి శీనయ్య కల్లు తాగేందుకు మేనాటిపాళెం వెళ్లాడు. అక్కడ ఓ యువతి ఒంటరిగా తిరుగుతుండగా బలాత్కారం చేయబోయాడు. ఇంతలో ఆమె తల్లి చూడటంతో శీనయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.



కూటమి ప్రభుత్వం మోసపు హామీలతో పొగాకు రైతులను మభ్యపెడుతోంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామంటూ రెండు నెలల నుంచి ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఇప్పటివరకు ఏ కేంద్రంలోనూ ఒక్క కేజీ కొనుగోలు చేసిన దాఖలాల్లేవు. ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తామని మరోసారి ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే 50 శాతం ఉత్పత్తులను రైతులు తక్కువ ధరకే అమ్మేసుకున్నారు.

- పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు
- రెండు నెలలైనా కేజీ కూడా కొనుగోలు చేయని వైనం
- ఇప్పటికే 50 శాతం పూర్తైన అమ్మకాలు
- తక్కువ ధరకే అమ్ముకుంటున్న రైతులు
- మరోసారి చంద్రబాబు ప్రకటనపై విస్మయం

‘కూటమి’ ఉత్తుత్తి ప్రకటనలు

2024 - 25 ఏడాదికి బోర్డు అనుమతి	105.25 మిలియన్ కేజీలు
ఉత్పత్తి అంచనా	142 మిలియన్ కేజీలు

కందుకూరు: పొగాకు రైతులను ఆదుకునే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం కేవలం మాటలు, ఉత్తుత్తి ప్రకటనలకే పరిమితమైంది. రెండు నెలలుగా కొనుగోళ్లపై ఆడుతున్న నాటకాలే ఇందుకు నిదర్శనం. పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటిలో జిల్లాలో కందుకూరు-1, 2, కలిగిరి, డీసీపల్లిలో ఉన్నాయి. 11 కేంద్రాల పరిధిలో 2024 – 25 ఏడాదికి 105.27 మిలియన్ కేజీలను అమ్ముకునేందుకు బోర్డు అనుమతిచ్చింది. మార్చి 10, 19వ తేదీల్లో రెండు దశల్లో అన్ని కేంద్రాల్లో వేలం ప్రక్రియ ప్రారంభమైంది.

వేలం ప్రారంభమయ్యాక..

రైతులకు మద్దతు ధర కరువైంది. కేవలం బ్రైట్ గ్రేడ్‌కు మాత్రమే కేజీకి రూ.280 ఇచ్చిన వ్యాపారులు, మిగిలిన వాటిపై ధరల్ని దారుణంగా తగ్గించారు. ఇప్పటి వరకు వచ్చిన సరాసరి ధర చూస్తే కేజీకి కేవలం రూ.241 మాత్రమే. మద్దతు ధర కోసం అన్నదాతలు రెండు నెలలుగా పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారు. వేలం ప్రక్రియను అడ్డుకోవడంతోపాటు, రోడ్లపైకి వచ్చి పొగాకు తగులబెట్టి తమ నిరసనను తెలుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీశారు. మద్దతు ధరలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దిగొచ్చిన ప్రభుత్వం వేలంలో పోటీని పెంచేందుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించుతున్నట్లు ప్రకటన చేసింది. కానీ నేటికీ ఏ కేంద్రంలోనూ మార్క్‌ఫెడ్ వేలం ప్రక్రియలో పాల్గొనలేదు.



నాడు.. నేడిలా..

గతంలో ఒకసారి పొగాకు మార్కెట్‌లో ధరల సంక్షోభం ఏర్పడినప్పుడు అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోలు చేయించారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ నెలకొని ధరలు పెరిగే పరిస్థితి వచ్చింది. నేటి కూటమి ప్రభుత్వం మాత్రం గత రెండు నెలలుగా కేవలం ఉత్తుత్తి ప్రకటనలకే పరిమితమైంది అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవానికి తూర్పు వీరాయపాళెం వచ్చిన సీఎం చంద్రబాబు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.273 కోట్లతో 20 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటన చేయడం గమనార్హం. ఇప్పటికే మార్క్‌ఫెడ్ వేలం ప్రక్రియలో పాల్గొని రైతులను ఆదుకునే సూచనలు కనిపించడం లేదు. ఈలోగా వేలం ప్రక్రియ దాదాపు పూర్తికావడం ఖాయం. అంటే రైతులను ఆదుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదని స్పష్టమవుతోంది.

గత్యంతరం లేక..

పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభమై దాదాపు నాలుగు నెలలవుతోంది. 11 కేంద్రాల పరిధిలో అధికారిక, అనధికార ఉత్పత్తి కలిపి 142 మిలియన్ కేజీల వరకు ఉండొచ్చని అంచనా. ఇప్పటికే 80 మిలియన్ కేజీలను రైతులు అమ్ముకున్నారు. అంటే దాదాపు 50 శాతానికి పైగా ఉత్పత్తులను అరకొర ధరలకే అమ్మేశారు. అయినా ఇప్పటికీ ప్రభుత్వం మద్దతు ధర కల్పించే ప్రయత్నం చేయడం లేదు. తక్కువ మొత్తం పండించిన రైతులు ఇప్పటికే తమ పంటను దాదాపుగా విక్రయించారు. ప్రభుత్వం ఇప్పుడు వేలం ప్రక్రియలోకి వచ్చినా సగం మందికి కూడా ప్రయోజనం ఉండకపోవచ్చనే అభిప్రాయం ఉంది. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కూటమి పెద్దల్లో చలనం లేదు.

దిగజారుతున్న ధరలు

మరోవైపు ప్రస్తుతం మార్కెట్‌లో రోజురోజుకూ ధరలు దిగజారుతున్నాయే తప్ప పెరుగుదల కానరావడం లేదు. ప్రారంభంలో బ్రైట్ గ్రేడ్ పొగాకుకు ఇచ్చిన ధరలే ఇప్పటికీ ఇస్తున్నారు. ఇక లోగ్రేడ్ ఉత్పత్తులను కొనుగోలు చేసే నాథుడే లేకుండా పోయాడు. గతేడాదికి ఈ ఏడాదికి మధ్య సరాసరి ధరలను పోల్చి చూస్తే భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. గతేడాది కేజీకి సరాసరి ధర రూ.360 వరకు వస్తే ప్రస్తుతం అది రూ.241 మాత్రమే ఉండటం గమనార్హం. అంటే సరాసరి ధరలో తేడా రూ.119ల వరకు ఉంది. కొంతకాలంగా లోగ్రేడ్ ఉత్పత్తులు అమ్ముడుపోవడం లేదు. కేంద్రాలకు తీసుకురావడం తిరిగి ఇంటికి తీసుకెళ్లడం రైతులకు భారంగా మారింది. దీంతో మరింత నష్టపోతున్నారు తప్ప ఏ ప్రయోజనం ఉండటం లేదు.

18,870 బంగారు కుటుంబాల ఎంపిక

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): పీ-4 కింద జిల్లాలో 18,870 బంగారు కుటుంబాలను, సుమారు 5 వేల మంది మార్గదర్శిలను ఎంపిక చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి పీ-4 కార్యక్రమంపై కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలు నుంచి జేసీ కార్తీక్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. సీఎస్ అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల నిరుపేద కుటుంబాలను ఈనెల 15వ తేదీలోగా ఎంపిక చేసి ఆర్థిక అసమానతలు తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, సీపీఓ నరసింహారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి, పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నెల్లూరు(అర్బన్): నల్సా వీర్ పరివార్ సహాయత యోజన పథకంలో భాగంగా గురువారం నెల్లూరులోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో ఇక్కడ సేవా క్లినిక్‌ను ప్రారంభించామన్నారు. ఇక్కడ ప్యానెల్ లాయర్, పారా లీగల్ వలంటీర్‌ను నియమించడం జరుగుతుందన్నారు. వీరు వారంలో ఒకరోజు సైనిక సంక్షేమ భవనంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. సైనికులు, మాజీ సైనికులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 15100కి కూడా ఫోన్ చేసి తమ సమస్యలు వివరించవచ్చన్నారు. అనంతరం సైనిక సంక్షేమాధికారి, మాజీ సైనికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ, మాజీ వింగ్ కమాండర్ శ్యామ్‌ప్రసాద్, అసోసియేషన్ నాయకులు కళాధర్, రత్నయ్య పాల్గొన్నారు.



సైనిక సంక్షేమాధికారితో మాట్లాడుతున్న జడ్జి వాణి

కండలేరులో 25.287 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 25.287 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1,250 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,780, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

18 నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష

• ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో భగవాన్ వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని నెల్లూరు ఆర్డీఓ అనూష తెలిపారు. గొలగమూడిలోని ఆశ్రమ పరిపాలనా కార్యాలయంలో ఆర్డీఓ గురువారం అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు పెద్ద ఎత్తున రానున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. నెల్లూరు ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్ల నుంచి గొలగమూడి గ్రామం వరకు ప్రత్యేక బస్సులు నడపాలని చెప్పారు. పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల దర్శన సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూ లైన్లు పెట్టాలన్నారు. ముఖ్యంగా రథోత్సవం, తెప్పోత్సవం రోజున పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అత్యవసర మందులతోపాటు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశంలో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

• డీఆర్వో హుస్సేన్ సాహెబ్



మాట్లాడుతున్న డీఆర్వో హుస్సేన్ సాహెబ్

నెల్లూరు(అర్బన్): చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ అధిక ప్రాధాన్యమిస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్ అన్నారు. గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేనేత వస్త్రాల స్టాల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో డీఆర్వో మాట్లాడుతూ పాశ్చాత్య మోజులో పడి చేనేత రంగాన్ని మరిచిపోకూడదన్నారు. దేశంలో ఈ రంగానికి గుర్తింపు, ప్రత్యేక స్థానం ఉన్నట్లు చెప్పారు. మనదేశంలో తయారు చేసిన నేత వస్త్రాలు వివిధ దేశాల్లో ఖ్యాతిని గడించాయన్నారు. కార్మికులను గౌరవించుకోవడం, చేనేత కళను బతికించుకోవడం కోసం వారానికి ఒక రోజైనా ప్రజలు నేత వస్త్రాలను ధరించాలని కోరారు. అనంతరం పలువురు కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి మారుతి ప్రసాద్, ఎల్‌డీఎం మణిశేఖర్, డీసీఓ గుర్రప్ప, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.31 సన్నవి : రూ.20
పండ్లు : రూ.8

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.102
లేయర్	రూ.112
బ్రాయిలర్ చికెన్:	రూ.190
స్కిన్‌లెస్ చికెన్:	రూ.212
లేయర్ చికెన్:	రూ.190



మహిళపై దాష్టీకం

- దాడి చేయడంతో ఆత్మహత్యాయత్నం
- నిందితులకు పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారం
- బాధిత కుటుంబం ఆరోపణ

సోమశిల: కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు, హత్యాయత్నాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పోలీసులు నిందితులకు సహకరిస్తూ బాధితులపైనే కేసులు బనాయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. చేజర్ల మండలంలోని మడపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వసంతమ్మకు వివాహమై పిల్లలున్నారు. భర్త మృతిచెందగా బిడ్డలను పోషించుకునేందుకు ప్రభుత్వ భూమిని సాగు చేస్తోంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, అతని బంధువులు సదరు భూమిని లాక్కునేందుకు కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారు. చంపేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని వసంతమ్మ ఆరోపించారు. పలుమార్లు రెవెన్యూ అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా సమాధానం చెప్పకుండా తమపైనే కేసులు బనాయిస్తామన్నారు. అసలు ప్రభుత్వ భూములు మీరెందుకు సాగు చేస్తున్నారని చేజర్ల తహసీల్దార్ మురళి అన్నారని ఆమె తెలిపారు. వసంతమ్మ పొలంలో కూరగాయల సాగు చేస్తుండగా బుధవారం సుబ్బారెడ్డి ట్రాక్టర్‌తో దున్నేందుకు వెళ్లాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన వసంతమ్మను నానా రకాలుగా మాట్లాడి విచక్షణారహితంగా దాడికి పాల్పడటంతో గాయపడింది. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోరని బాధితురాలు తీవ్ర మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను బాధిత కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి కుమార్తె గురువారం మాట్లాడుతూ సుబ్బారెడ్డిని అడిగితే.. నేనేమైనా చేస్తా.. మీరు తక్కువ కులానికి చెందినవారు.. నేను తలుచుకుంటే మీ బట్టలు కూడా లేకుండా చేస్తామని బెదిరించాడని వాపోయింది. ఎస్సై, తహసీల్దార్ అతడికి సహకరిస్తూ మా మీదకి దాడిచేసేందుకు వస్తున్నారంటూ ఆవేదన చెందారు. అమ్మ చనిపోతే మాకు దిక్కెవరని, న్యాయం జరిగేలా చూడాలని రోదిస్తూ తెలియజేశారు.



తల్లిని చూసి రోదిస్తున్న కుమార్తె

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి



స్థానికులతో మాట్లాడుతున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నగరంలో నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసు అధికారులు దృష్టి సారించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎవరెవరు నివాసం ఉంటున్నారు? ఏం చేస్తున్నారు? తదితర వివరాలను సేకరిస్తున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా పెంచారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. గురువారం రాత్రి నెల్లూరు నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు అధికారులు పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అసాంఘిక కార్యకలాపాలు, మత్తు, మాదక ద్రవ్యాల విక్రయాలు, రౌడీషీటర్లు, ఈవ్‌టీజర్ల వేధింపులను గుర్తిస్తే వెంటనే సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు. నేర నియంత్రణకు తాము తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగర ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, జి.వేణుగోపాల్‌రెడ్డి, జి.దశరథ రామారావు, కె.రోశయ్య, కె.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.